జయ గురు దత్త                శ్రీ గురు దత్త

# హనుమాన్ చాలీసా (తెలుగు)
అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ విరచితం

శ్రీ గురు చరణ సరోజ రజస్సుతో – మనసను అద్దము శుచి గావించి
రఘుపతి చరితము గానము చేయుచు – నాలుగు విధముల ఫలములనందుము
హనుమను విడువక తలచిన భక్తిగ – బుద్ధి హీనతయు తొలగును నిజముగ
బుద్ధిని బలమును విద్య నొసంగును – వికారదూరుడు ఆంజనేయుడు

1 జయ హనుమాన జ్ఞాన గుణ సాగర – జయ కపీశ మము కావర దేవర
2 రామ దూత అతులిత బలవంతా – హనుమా నీవే మా బలమంతా
3 మహావీర విక్రమ భుజశాలీ – కుమతిని చెరుపుట నీకది కేళి
4 బంగరు వన్నెతో వెలిగెడి దేవా – గురుపై మమ్మిక కావగ రావా
5 చేతను దాల్చిన వజ్రాదులతో – విరాజమానుడ ! హే ఉపవీతి
6 శంకర అంశజ ! కేసరి నందన ! – తేజోరాశీ అంజని చందన !
7 విద్యా వారధి బహుగుణచతురా ! – కార్యసిద్ధికర కపివర వీర !
8 భక్తితో రాముని కథలను వింటివి – హృది సీతాపతి ఉన్నాడంటివి
9 సూక్ష్మరూపమున సీతను పోల్చి – తీక్ష్ణ రూపమున లంకను కాల్చి
10 భీమరూపమున అసురుల కూల్చి – రామకార్యమును చేస్తివి గెల్చి
11 హే సంజీవన లక్ష్మణ జీవన ! – రామాలింగన పులకిత భావన
12 రఘుపతి కీరితి పెంచితివయ్యా – స్వామికి భరత సమానుడవయ్యా
13 వేయిపడగల ఫణి కీర్తించెను – అని నిను రాముడు కౌగిట ముంచెను
14 సనకాదులు బ్రహ్మాది సుధాదులు – నారద తుంబురు శారదాదులు
15 ఇంద్ర యమాదులు దిక్పదయుక్తులు – కవులందరు నిను పొగడ అశక్తులు
16 సుగ్రీవుడు నీ మేలును పొంది – రాముని కలిసె రాజ్యము నందె
17 అభయమునంది విభీషణుడేలే – ఆ లంకేశుడు భయమున తూలె
18 భానుని ఫలమని తలచి గ్రహించి – హనుమన్నాముడవైతివి దేవా
19 ప్రభుముద్రికను మోమున దాల్చి – జలధిని దాటగ అచ్చెరువేమి ?

| | | | |
|---|---|---|---|
| 20 | జగమున దుర్గమ కార్యములన్నియు | – | సుగమము లాయెను నీకృపతోడను |
| 21 | రాముని ద్వారము నందున ఉందువు | – | నీ యానతితో కదులును లోకము |
| 22 | నిను శరణనగా కలుగును సుఖములు | – | నీ రక్షణలో తొలగును భయములు |
| 23 | నీ తేజోభర హుంకారమున | – | కంపనమొందెను త్రిజగతి భయమున |
| 24 | భూత ప్రేత పిశాచములన్నియు | – | నీనామంబును పలికిన విడచును |
| 25 | రోగ వినాశము పీడాహరణము | – | చేయును హనుమా ! నీ దగు మంత్రము |
| 26 | సంకటముల నువు విడిపించెదవు | – | ధ్యానము నందున మది గుడి నుందువు |
| 27 | రాముడె గమ్యము ముని కులమునకు | – | నీవే గమ్యము మాకందరకు |
| 28 | నిను సేవించిన కోర్కెలు తీరును | – | ముక్తి పదంబది జీవులకందును |
| 29 | నీదు ప్రతాపము నాలుగు యుగముల | – | సిద్ధిని పంచును కీర్తిని పెంచును |
| 30 | సాధు రక్షక ! దుష్ట శిక్షక ! | – | అసుర నాశక ! రామ సేవక ! |
| 31 | అష్టసిద్ధి నవనిధులను ఒసగే | – | హనుమడు సీతా కృపతో వెలిగే |
| 32 | రామ రసాయనమున్నది నీదరి | – | నువు కొలువుండుము హనుమా ! మాదరి |
| 33 | నిను భజియించిన రాముడు దొరకును | – | శతశత జన్మల పాపము తొలగును |
| 34 | రాముని కొలిచిన అవసానమున | – | భక్తుడు వెలుగును హరిధామమున |
| 35 | మనసున హనుమను నిలిపిన సుఖము | – | మరు జన్మములిక కలుగవు నిక్కము |
| 36 | నీస్మరణముచే కష్టము తీరును | – | ఓ బలవీర ! పీడలు తొలగును |
| 37 | జై జై జై హనుమాన గోసాయీ | – | సద్గురు రూపా ! బహుఫలదాయీ ! |
| 38 | ఈ స్తోత్రంబును శతపర్యాయము | – | చదివిన మోక్షము శివుడే సాక్ష్యము |
| 39 | కవి వాల్మీకియు తులసీదాసులు | – | హనుమను దలచిరి ముక్తిని పొందిరి |
| 40 | ఇది తెనుగించెను సచ్చిదానందుడు | – | దీనిని చదివిన సచ్చిదానందము |

పవన తనయ సంకట హరణ – మంగళ మారుతి రూప
సీతారాముల హృదయము నందున– నిలిపిన వానర సురభూప